RNI NO : TELTEL/2023/88524

మెదక్ టుడే దిన పత్రిక

ఎడిటర్ : సిహెచ్. శివకుమార్ సంపుటి : 04 సంచిక : 172
శనివారం, జూన్ 06, 2026 , పేజీలు - 4 వెల : 2/-

**మంచిమాట**

గెలవాలన్న స్ఫూర్తితో పోరాడు...
ఓడినా తట్టుకోగలవు.
గెలిచి తీరాలనే అహంతో పోరాడకు...
ఓడిపోతే తట్టుకోలేవు.

# 500 మంది పోలీసుల మెరుపు దాడి
# ఉలిక్కిపడ్డ స్పా సెంటర్ల నిర్వాహకులు




**హైదరాబాద్ :**మల్కాజిగిరి సీపీ సుమతి .. తన పనితీరుతో సర్వత్రా ప్రశంసలు ఎదుర్కొంటున్న సంగతి తెలిసిందే. కొన్ని రోజుల క్రితం మహిళల భద్రతను స్వయంగా పర్యవేక్షించేందుకు దిల్‌సుఖ్‌నగర్‌లో సివిల్ డ్రెస్‌లో రాత్రి పూట గస్తీ కాసిన సీపీ సుమతి .. తాజాగా మరో భారీ ఆపరేషన్ చేపట్టారు. మల్కాజిగిరి పోలీస్ కమిషనరేట్ పరిధిలో ఉన్న స్పా సెంటర్లపై మెరుపు దాడులు చేశారు. మల్కాజిగిరి సీపీ సుమతి ఆధ్వర్యంలో దాదాపు 500 మంది పోలీసులు.. శుక్రవారం రోజున ఏకకాలంలో ఏకంగా 113 స్పా సెంటర్లలో తనిఖీలు నిర్వహించారు. స్పా సెంటర్ల పేరుతో అక్కడ అసాంఘిక కార్యక్రమాలు జరుగుతున్నట్లు గుర్తించారు. మల్కాజిగిరి కమిషనరేట్ పరిధిలోని స్పా సెంటర్లలో అక్రమాలు, అసాంఘిక కార్యక్రమాలు జరుగుతున్నట్లు నిర్ధారించుకున్న పోలీసులు.. అక్కడికి వచ్చే కస్టమర్ల వివరాలు నమోదు చేసే రిజిస్టర్‌ను కూడా స్పా సెంటర్ నిర్వాహకులు సరిగ్గా రికార్డు చేయడం లేదని పోలీసుల విచారణలో గుర్తించారు. అదే సమయంలో స్పా సెంటర్లకు ఇళ్లను అద్దెకు ఇస్తున్న ఓనర్లను కూడా పోలీసులు విచారణ జరిపారు. స్పా సెంటర్ల ఓనర్లు ఇచ్చే అద్దెను తీసుకోవడం తప్ప.. అక్కడ ఏం జరుగుతుంది అని కూడా యజమానులు పట్టించుకోవడం లేదని పోలీసుల విచారణలో వెల్లడైంది. ఈ క్రమంలోనే ఈ తనిఖీల్లో చాలా స్పా సెంటర్లలో చాలా అక్రమాలు జరుగుతున్నాయని పోలీసులు గుర్తించారు. వీటిపై ఆ స్పా సెంటర్లకు అద్దెకు ఇచ్చిన ఇంటి ఓనర్లు ఎలాంటి సమాచారాన్ని ఇవ్వడం లేదని పోలీసులు తేల్చారు. హైదరాబాద్ నగరంలో భారీగా ఉన్న స్పా సెంటర్ల ముసుగులో అసాంఘిక కార్యకలాపాలు జరుగుతున్నాయని నిత్యం పోలీసులకు ఫిర్యాదులు అందుతూనే ఉన్నాయి. దీంతో ఆ ఫిర్యాదులను పరిగణలోకి తీసుకున్న మల్కాజిగిరి పోలీసులు.. ఆకస్మికంగా దాడులు చేస్తున్నారు. ఈ సందర్భంగా ఆయా స్పా సెంటర్లపై కేసులు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. హైదరాబాద్‌లో ఒకేసారి భారీగా స్పా సెంటర్లపై పోలీసులు ఒకేసారి దాడులు చేయడం ఇదే తొలిసారి అని సంబంధిత వర్గాలు తెలుస్తోంది. ఈ నేపథ్యంలోనే స్పా సెంటర్ల నిర్వహణ విషయంలో కఠిన నిబంధనలు అమలు చేయాలని.. నగరవాసులు పోలీసులకు విజ్ఞప్తి చేస్తున్నారు. స్పా సెంటర్ల పేరుతో అసాంఘిక చర్యలకు పాల్పడేవారిపై కఠిన చర్యలు తీసుకోవడం ద్వారా ఇలాంటి వాటికి అడ్డుకట్ట వేయొచ్చని పోలీసులను కోరుతున్నారు. ఈ క్రమంలోనే మల్కాజిగిరి సీపీ సుమతిపై ప్రశంసల వర్షం కురుస్తోంది.

## గిల్గిత్-బాల్టిస్థాన్ ఎన్నికలపై
## భారత్ తీవ్ర ఆగ్రహం



**న్యూ ఢిల్లీ :**గిల్గిత్-బాల్టిస్థాన్ అసెంబ్లీకి సాధారణ ఎన్నికలు నిర్వహించాలని పాక్ నిర్ణయిం చడంపై భారత్ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసింది. అది భారతదేశ భూభాగమని, దానిని పాక్ చట్టవిరుద్ధంగా, బలవంతంగా ఆక్రమించిందని పేర్కొంది. పాక్ చేస్తున్న ఇటువంటి ప్రయత్నాలు తీవ్రమైన మానవహక్కుల ఉల్లంఘనలు, రాజకీయ అణచివేత, ఆర్థిక దోపిడీ, స్వేచ్ఛను హరించడం లాంటివి ఆ దేశ అంతర్లీన ప్రాథమిక సమస్యలను దాచలేవని భారత్ తేల్చిచెప్పింది. పాకిస్థాన్ చట్టవిరుద్ధంగా, బలవంతంగా ఆక్రమించిన భారత భూభాగమైన గిల్గిత్-బాల్టిస్థాన్‌లో జూన్? 7న సాధారణ ఎన్నికలు నిర్వహించాలని తలపెట్టింది. దీనిపై భారత ప్రభుత్వం పాకిస్థాన్‌కు తీవ్ర నిరసన వ్యక్తం చేసింది.“ 1947లో జమ్మూకశ్మీర్ భారతదేశంలో పూర్తిగా, చట్టబద్ధంగా విలీనం అయ్యింది. దీనితో గిల్గిత్-బాల్టిస్థాన్‌తో సహా జమ్మూకశ్మీర్ లద్ధాఖ్ కేంద్రపాలిత ప్రాంతాలన్నీ భారతదేశంలో అంతర్భాగం అయ్యాయి.

## విలువైన ప్రభుత్వ భూముల్లో పేదలకు
# ఇందిరమ్మ ఇళ్లు




**హైదరాబాద్, జూన్05:** కోట్ల రూపాయిల విలువైన ప్రభుత్వ భూముల్లో పేదలకు ఇందిరమ్మ ఇళ్లు నిర్మిస్తామని గృహ నిర్మాణ, రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి వెల్లడించారు. క్యూర్ పరిధిలో ఎల్ఐజీ, ఎంఐజీ వర్గాలకు లక్ష ఇళ్ల నిర్మాణం చేపడతామన్నారు. శుక్రవారం హైదరాబాద్‌లోని సచివాలయంలో క్యూర్ పరిధిలో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణంపై ఉన్నతాధికారులతో మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ.. మహిళలకు ఇంటి స్థలంలో యాజమాన్య హక్కులు కల్పిస్తామన్నారు. 2026-27 ఆర్థిక సంవత్సరంలో మొత్తం 3.50 లక్షల ఇళ్లకు పరిపాలనా అనుమతులు ఇస్తామని పేర్కొన్నారు. క్యూర్ పరిధిలో లక్ష ఇళ్లు, ఇతర ప్రాంతాల్లో 2.50 లక్షల ఇళ్లు నిర్మిస్తామని వివరించారు. ఖాళీగా ఉన్న డబుల్ బెడ్‌రూమ్ ఇళ్ల విధానంపై ఈ సందర్భంగా మంత్రి విమర్శించారు. పేదల సంక్షేమం కోసం విలువైన ప్రభుత్వ భూములు వినియోగిస్తామని చెప్పారు. కనీసం 400 చదరపు అడుగుల విస్తీర్ణంతో ఇళ్ల నిర్మాణం చేపడతామని తెలిపారు. పేదలకు గౌరవప్రదమైన జీవితమే లక్ష్యంగా తమ ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని మంత్రి పొంగులేటి స్పష్టం చేశారు.

## హైదరాబాద్‌లో
# ఎబోలా కలకలం




**హైదరాబాద్, జూన్ 5:**
హైదరాబాద్‌లో ఎబోలా వైరస్ కల కలం రేపుతోంది. అనుమానిత ఎబో లా లక్షణాలతో మరో ఇద్దరు వ్యక్తులు సికింద్రాబాద్‌లోని గాంధీ ఆసుపత్రిలో చేరారు. దీంతో ఇప్పటివరకు ఈ వైరస్ లక్షణాలతో గాంధీ ఆసుపత్రిలోని ఐసోలేషన్ వార్డుకు చేరిన వారి సంఖ్య ముగ్గురికి చేరింది. ఈ రోజు తెల్లవారుజామున ఇద్దరు వ్యక్తులు ఎబోలా లక్షణాలతో జూబ్లీహిల్స్‌లోని అపోలో ఆసుపత్రికి వెళ్లారు. వారిని పరిశీలించిన వైద్యులు ప్రాథమిక లక్షణాల ఆధారంగా ఎబోలాగా అనుమానించారు. బాధితులను తక్షణమే మెరుగైన చికిత్స, ప్రత్యేక నిఘా కోసం గాంధీ ఆసుపత్రికి తరలించారు. కాగా, నిన్ననే మరో వ్యక్తిని కూడా ఇలాంటి లక్షణాలతోనే గాంధీ ఆసుపత్రికి తరలించిన సంగతి తెలిసిందే. వైద్య ఆరోగ్య శాఖ అధికారులు జరిపిన ప్రాథమిక విచారణలో ఒక కీలక విషయం వెలుగుచూ సింది. ప్రస్తుతం గాంధీ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న ముగ్గురు అనుమానితులు కూడా విదేశాల నుంచి ఒకే ఫ్లైట్‌లో హైదరాబాద్ వచ్చినట్లు అధికారులు గుర్తించారు. ముగ్గురు బాధితులు ఒకే విమానంలో ప్రయాణించారనే విషయం తేలడంతో వైద్య నిపుణులు, ఎయిర్‌పోర్ట్ అధికారులు అప్రమత్తమయ్యారు. సదరు ఫ్లైట్‌లో ప్రయాణించిన మిగతా ప్రయాణికుల వివరాలను సేకరించే పనిలో అధికారులు నిమగ్నమయ్యారు. వారిలో ఎవరికైనా ఇలాంటి లక్షణాలు ఉన్నాయా అనే కోణంలో ట్రాక్ చేస్తున్నారు. ప్రస్తుతం గాంధీ ఆసుపత్రిలో చేరిన ముగ్గురికీ ప్రత్యేక ఐసోలేషన్ వార్డులో ఉంచి చికిత్స అందిస్తున్నారు. వీరి రక్త నమూనాలను సేకరించి, తుది నిర్ధారణ కోసం పుణెలోని నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ వైరాలజీ కి పంపేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. చెందవద్దని, అధికారులు అన్ని ముందస్తు జాగ్రత్తలు తీసుకుంటున్నారని వైద్య వర్గాలు తెలిపాయి.

## పెండింగ్ ప్రాజెక్టులను యుద్ధ
# ప్రాతిపదికన పూర్తి చేస్తాం

- పాలమూరు జిల్లాకు కేసీఆర్ చేసిందేమీ లేదు
- ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా రెండో రోజు సీఎం రేవంత్ రెడ్డి పర్యటన
- ఉమ్మడి పాలమూరు జిల్లాలో ప్రాజెక్టులు పరిశీలించిన ముఖ్యమంత్రి
- పాలమూరు-రంగారెడ్డి ప్రాజెక్టు పరిశీలించిన రేవంత్ రెడ్డి



**మహబూబ్‌నగర్ జిల్లా :**సాగు, తాగునీటి ప్రాజెక్టులకు సంబంధించి క్షేత్రస్థాయి పర్యటన చేసి, పరిశీలించి భవిష్యత్ కార్యాచరణ తయారీకి చర్యలు చేపట్టినట్లుగా సీఎం రేవంత్ రెడ్డి తెలిపారు. ప్రాతిపదికన పెండింగ్ పనులు : పాలమూరు జిల్లాలో పెండింగ్ ప్రాజెక్టులను యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేస్తామని సీఎం రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు. ప్రాజెక్టుల నిధుల కోసం పక్కా కార్యాచరణతో క్షేత్రస్థాయి పర్యటన చేస్తామన్నారు. భూసేకరణకు సంబంధించి రూపాయి ఎక్కువైనా ఇచ్చి సమస్యలు పరిష్కరిస్తామని స్పష్టం చేశారు. జిల్లా ప్రాజెక్టుల పూర్తికి సంపూర్ణంగా కట్టుబడి ఉన్నామని వెల్లడించారు. తక్కువ భూసేకరణ ఉండి ఎక్కువ నీళ్లు నిల్వచేసుకునే ప్రాజెక్టులు త్వరగా పూర్తి చేస్తామన్నారు. ప్రాజెక్టులను కొలిక్కి తెచ్చేందుకు ప్రయత్నిస్తున్నామని రేవంత్ రెడ్డి తెలిపారు. తాము పనులు చేపడుతుంటే వాళ్లు(బీఆర్ఎస్) రాజకీయ కార్యాచరణ చేపడుతున్నారని వివరించారు. పాపాలు చేయడమే కాకుండా కేసీఆర్ చేస్తుంటే చూడటం కూడా మహాపాపమని ఆక్షేపించారు. సాగునీటి ప్రాజెక్టులకు చేసిన అప్పులకు రూ.84 వేల కోట్లు చెల్లించారన్నారు. గత పాలనలో ఇరిగేషన్ ప్రాజెక్టులకు చేసిన అప్పులకు రూ.52 వేల కోట్ల చెల్లించామన్నారు. రాష్ట్రంలో ప్రాజెక్టులకు తాము అధికారంలోకి వచ్చాక రూ.22 వేల కోట్లు ఖర్చు చేశామన్నారు. వాటిలో రూ.8 వేల కోట్లు పాలమూరు ప్రాజెక్టుకు ఇచ్చామని అన్నారు.కేసీఆర్ రద్దయిన రూ.1000 నోటు వంటివారు : బీఆర్ఎస్ ఏ ప్రాజెక్టయినా మొదలు పెట్టి పూర్తి చేసిందా చెప్పాలని రేవంత్ రెడ్డి సవాల్ విసిరారు. ప్రాణహిత-చేవెళ్ల పేరు మార్చి ఊరు మార్చి దోపిడీ చేయడమే కేసీఆర్?కు తెలుసన్నారు. కేసీఆర్ సొంతంగా మొదలు పెట్టి చేపట్టిన ప్రాజెక్టు రాష్ట్రంలో ఒక్కటీ లేదన్నారు. ఆ ప్రాజెక్టుల విషయమై అసెంబ్లీలో చర్చిద్దామన్నారు. కష్టకాలంలో పాలమూరు నుంచి కేసీఆర్?ను ఎంపీగా గెలిపిస్తే అభివృద్ధి చేస్తారని ఆశించామన్న ఆయన, కృష్ణా జలాలు పూర్తిగా జిల్లాలో ప్రవహించినా ఎన్నడూ ఒడిసిపట్టుకోలేదని ఆక్షేపించారు. కేసీఆర్ సీఎం అయ్యాక అవాస్తవాలతో ప్రజలను మభ్య పెట్టే ప్రయత్నం చేశారన్నారు. పాలవ యారు-రంగారెడ్డి ఎత్తిపోతల ప్రాజెక్టు పరిశీలనలో భాగంగా సీఎం రేవంత్ రెడ్డి నార్లాపూర్ హెడ్ రెగ్యులేటర్ పరిశీలిం చారు. హెడ్ రెగ్యులేటర్ వద్ద ప్రాజె క్టుకు సంబంధించిన పనుల పురోగతిని అధికారులను అడిగి తెలుసుకున్నారు. పంపులు, లిఫ్టు పనుల్లో అవినీతిపై నాగం జనార్దన్ రెడ్డి ఏళ్ల తరబడి పోరాడారని తెలిపారు.యుద్ధ

## తెలంగాణ జల హక్కులను కాపాడటంలో
# సర్కార్ విఫలం




**హైదరాబాద్, జూన్ 5:** ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి మాజీ మంత్రి హరీశ్ రావు బహిరంగ లేఖ రాశారు. కాంగ్రెస్ ప్రభుత్వ నిర్లక్ష్యం వల్ల తెలంగాణ జల హక్కులు తీవ్ర ప్రమాదంలో పడ్డాయని లేఖలో ఆరోపించారు. ఎత్తిపోతల పంపుల నిర్వహణ విషయంలో బీఆర్ఎస్ ప్రభుత్వం ఇచ్చిన హెచ్చరికలను ప్రస్తుత ప్రభుత్వం పట్టించుకోలేదని విమర్శించారు. దీంతో పంపులు దెబ్బతిని, కాళేశ్వరం, దేవాదుల ప్రాజెక్టుల నిర్వహణలో తీవ్ర వైఫల్యం చోటుచేసుకుందని తెలిపారు. తెలంగాణ జల హక్కులను కాపాడటంలో కాంగ్రెస్ ప్రభుత్వం దారుణంగా విఫలమైందని ఆరోపించారు. కృష్ణా జలాల వినియోగంలో తెలంగాణ చారిత్రక కనిష్ఠ స్థాయికి పడిపోయిందన్నారు. ఆంధ్రప్రదేశ్ 74 శాతం వినియోగిస్తుంటే.. తెలంగాణ 25 శాతానికి పరిమితమైందని లేఖలో తెలిపారు.రైతులు, తాగునీటి అవసరాలు, పరిశ్రమల భవిష్యత్తును కాంగ్రెస్ ప్రమాదంలో పడేసిందని మాజీ మంత్రి విమర్శించారు. సోలార్ ఆధారిత విద్యుత్ విధానాలు సాగునీటి రంగానికి ముప్పుగా మారాయని లేఖలో స్పష్టం చేశారు. అందుకే రైతు డిస్కం ప్రతిపాదనను వెంటనే ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్టులకు 24 గంటల నాణ్యమైన విద్యుత్ సరఫరా చేయాలన్నారు. భవిష్యత్తును ప్రశ్నార్థకం చేయకుండా జల హక్కులను సమర్థంగా కాపాడాలని హరీశ్ రావు లేఖలో పేర్కొన్నారు.

## విశాఖలో సీఎం చంద్రబాబు సైకిల్ ప్రయాణం
# ఏయూ వీసీకి కీలక ఆదేశాలు!



**విశాఖపట్నం:** ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని పురస్కరిం చుకుని ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్ర బాబు నాయుడు విశాఖపట్నంలో పర్యటి ంచారు. ఈ సందర్భంగా నగరంలో ఏర్పాటు చేసిన పర్యావరణ దినోత్సవ వేడు కల్లో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని, మొక్క లు నాటారు. పర్యావరణ పరిరక్షణపై ప్రజల్లో అవగాహన కల్పించేందుకు సీఎం స్వయంగా సైకిల్ తొక్కి అందరినీ ఆకట్టుకున్నారు. ఏయూ నుంచి 4 ప్రయాణం!పర్యావరణ పరిరక్షణ, కాలుష్య నివారణ అనే అంశాలపై ప్రజల్లో చైతన్యం తీసుకురావడానికి సీఎం చంద్రబాబు నాయుడు స్వయంగా రంగం లోకి దిగారు. ఆంధ్ర విశ్వవిద్యాలయం ప్రాం గణం నుండి ఆయన సైకిల్‌పై ప్రయాణాన్ని ప్రారంభించారు. అక్కడి నుండి సుమారు 4 కిలోమీటర్ల మేర చంద్రబాబు సాగించిన సైకిల్ ప్రయాణం నగర ప్రజల్లో, కూటమి శ్రేణుల్లో సరికొత్త ఉత్సాహాన్ని నింపింది. ఏయూలో గ్రీనరీ కేవలం 25 శాతమేనా?.. వీసీపై సీఎం అసంతృప్తి!విశాఖ పర్యటనలో భాగంగా ఆంధ్ర యూనివర్సిటీ పరిధిలోని పచ్చదనం పై ముఖ్య మంత్రి ప్రత్యేక సమీక్ష జరిపారు.ఇంత పెద్ద ప్రతిష్టాత్మకమైన ఆంధ్ర విశ్వవిద్యాలయం క్యాంపస్‌లో ప్రస్తుతం పచ్చదనం కేవలం 25 శాతం మాత్రమే ఉండటంపై సీఎం చంద్రబాబు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు.క్యాంపస్ వ్యాప్త ంగా పచ్చదనాన్ని భారీగా పెంచేలా తక్షణమే తగిన చర్యలు తీసుకోవాలని యూనివర్సిటీ వైస్ ఛాన్సలర్ ను ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఆదేశించారు. విద్యార్థులను భాగస్వామ్యం చేస్తూ వర్షాకాలంలో పెద్ద ఎత్తున మొక్కలు నాటాలని సూచించారు.

## ఆత్మనిర్భర్ భారత్ గిట్టని
# నిరాశావాదులు వాళ్లు



**న్యూఢిల్లీ:** లోక్‌సభలో ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీపైన, కాంగ్రెస్ పార్టీపైనా గుజరాత్‌లోని సూరత్‌లో శుక్రవారంనాడు జరిగిన బహిరంగ సభలో ప్రధాన నరేంద్ర మోదీ విమర్శలు గుప్పించారు. దేశంలో కొందరు నిరాశావాదులు ఉన్నారనీ, 'అత్మనిర్భర్ భారత్' ప్రచారాన్ని, దేశ దృఢ సంకల్పాన్ని విమర్శించడమే వీళు పనిగా పెట్టుకున్నారని అన్నారు. ఇతర దేశాలపై ఆధారపడం వల్ల ఏ దేశం తాను నిజంగా సాధించాల్సిన అభివృద్ధిని అందుకోలేదన్న విషయాన్ని వీరు విస్మరిస్తున్నారని విమర్శించారు. కాంగ్రెస్ పార్టీ అలజడలు, అస్థిరతను వ్యాప్తి చేయడం ద్వారా అవకాశాలు పొందాలని కోరుకుంటోందని, అయితే దేశ ప్రజలకు వీరి పన్నాగాలను ఎప్పటికప్పుడు తిప్పికొడుతూ వస్తున్నారని ప్రధాని అన్నారు. 'గుజరాత్ ప్రజలు కాంగ్రెస్ పార్టీని అడ్రెస్ లేకుండా చేసారు. కాంగ్రెస్ అధికారంలో ఉన్న చోట్ల కూడా వారి అవకతవకల పాలనపై ప్రజలు అసంతృప్తితో ఉన్నారు. ఇటీవల హిమాచల్ ప్రదేశ్ స్థానిక సంస్థల ఎన్నికల్లో వచ్చిన ఫలితాలే ఇందుకు ఉదాహరణ. అక్కడ కాంగ్రెస్ ప్రభుత్వమే ఉన్నప్పటికీ ఆ పార్టీ దారుణమైన ఓటమి చవిచూసింది. కాంగ్రెస్ అవకతవకల పాలనను హిమాచల్ ప్రజలు తిప్పికొట్టారు. దీనికి ముందు హర్యానాలో జరిగిన స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్ ఓడిపోయింది. పంజాబ్ ప్రజలు కూడా ఆ పార్టీకి స్పష్టమైన సందేశం ఇచ్చారు. అల్లకల్లోలంలో అవకాశాలు వెతుక్కోవడం అనే కాంగ్రెస్ రాజకీయం ఎప్పటికీ పనిచేయదు' అని మోదీ అన్నారు.

# ఎంపీడీఓ కార్యాలయంలో ప్రపంచ పర్యావరణ దినోత్సవం : మొక్కలు నాటి, పర్యావరణ ప్రతిజ్ఞ చేసిన అధికారులు





**చేగుంట, జూన్ 05 మెదక్ టుడే న్యూస్**

చేగుంట మండలం, ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని పురస్కరించుకొని చేగుంట మండల పరిషత్ అభివృద్ధి అధికారి (ఎంపీడీఓ) కార్యాలయ ప్రాంగణంలో శుక్రవారం పర్యావరణ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ చిన్నారెడ్డి, మండల పరిషత్ అధికారి (ఎంపీఓ) ప్రకాష్ కార్యాలయ సిబ్బందితో కలిసి మొక్కలు నాటారు. అనంతరం పర్యావరణాన్ని, ప్రకృతిని జాగ్రత్తగా కాపాడుకుంటామని అందరూ కలిసి ఉమ్మడిగా పర్యావరణ ప్రతిజ్ఞ చేశారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ చిన్నారెడ్డి మాట్లాడుతూ మానవ మనుగడకు పర్యావరణ రక్షణ ఎంతో కీలకమని, ప్రతి ఒక్కరూ బాధ్యతగా మొక్కలు నాటడమే కాకుండా వాటిని సంరక్షించేలా నిరంతరం కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ చిన్నారెడ్డి తో పాటు ఎంపీఓ ప్రకాష్, కార్యాలయ సిబ్బంది అందరూ ఉత్సాహంగా పాల్గొన్నారు.

# చేగుంట ఇండోర్ బాడ్మింటన్ స్టేడియం స్థల కేటాయింపుకై ఎమ్మెల్యే రోహిత్, చెరుకు శ్రీనివాస్ రెడ్డిలకు వినతి







**?చేగుంట, జూన్ 05 మెదక్ టుడే న్యూస్**

చేగుంట మండల కేంద్రంలో ఇండోర్ షటిల్ బాడ్మింటన్ స్టేడియం నిర్మాణానికి స్థలాన్ని కేటాయించేలా సహకరించాలని కోరుతూ చేగుంట బాడ్మింటన్ క్లబ్ ప్రెసిడెంట్ విష్ణు మెదక్ శాసనసభ్యులు (ఎమ్మెల్యే) మైనంపల్లి రోహిత్ రావును , అలాగే దుబ్బాక నియోజకవర్గ కాంగ్రెస్ ఇంచార్జ్ చెరుకు శ్రీనివాస్ రెడ్డి ని మర్యాదపూర్వకంగా కలిశారు. చేగుంటలోని అంబేద్కర్ విగ్రహం వెనుక భాగంలో ఉన్న సింగరాపుకుంటలోని 8 గుంటల స్థలాన్ని బాడ్మింటన్ స్టేడియం నిర్మాణానికి కేటాయించేలా గ్రామపంచాయతీ ద్వారా తీర్మానం చేయించడంలో ప్రజాప్రతినిధుల సహాయం కావాలని ఆయన వినతిపత్రం అందజేశారు. ఈ విషయమై సానుకూలంగా స్పందించిన ఎమ్మెల్యే రోహిత్, చెరుకు శ్రీనివాస్ రెడ్డిలు చేగుంట క్రీడాకారుల ప్రయోజనాల దృష్ట్యా స్టేడియం ఏర్పాటుకు తగిన సహాయ సహకారాలు అందిస్తామని స్థానిక బాడ్మింటన్ క్లబ్ ప్రతినిధులకు హామీ ఇచ్చారు.

# విద్యార్థుల భద్రతే లక్ష్యం.. పాఠశాల బస్సులపై ప్రత్యేక తనిఖీలు ఇన్స్పెక్టర్ స్వప్న

**(స్పెషల్ కరస్పాండెంట్)**

**షాద్‌నగర్,జూన్,5,మెదక్ టుడే న్యూస్:**

నూతన విద్యా సంవత్సరం ప్రారంభమైన నేపథ్యంలో విద్యార్థుల రవాణా భద్రతపై ప్రత్యేక దృష్టి సారించిన రవాణా శాఖ అధికారులు షాద్‌నగర్ పరిధిలోని ప్రైవేటు విద్యాసంస్థల బస్సులను క్షుణ్ణంగా తనిఖీ చేశారు. మోటార్ వెహికల్ ఇన్స్పెక్టర్ సి. స్వప్న ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ తనిఖీల్లో బస్సుల సాంకేతిక పరిస్థితులు, భద్రతా ప్రమాణాలు, అవసరమైన పత్రాలను పరిశీలించారు.

బస్సుల ఫిట్‌నెస్ సర్టిఫికెట్లు, బ్రేక్ వ్యవస్థ, టైర్ల స్థితి, అత్యవసర నిష్క్రమణ ద్వారాలు, అగ్నిమాపక పరికరాలు, ఫస్ట్ ఎయిడ్ కిట్లు,



విద్యార్థుల భద్రతకు సంబంధించిన ఇతర సౌకర్యాలను అధికారులు పరిశీలించారు. పాఠశాల బస్సులు ఎలాంటి లోపాలు లేకుండా నిబంధనలకు అనుగుణంగా ఉండాలని సూచించారు. ఈ సందర్భంగా ఎంవీఐ స్వప్న మాట్లాడుతూ, విద్యార్థుల ప్రాణ భద్రత విషయంలో రాజీ పడే అవకాశం లేదన్నారు. ప్రతి విద్యాసంస్థ తమ వాహనాల నిర్వహణపై నిరంతర పర్యవేక్షణ చేపట్టాలని, రవాణా శాఖ నిబంధనలను కచ్చితంగా అమలు చేయాలని సూచించారు. భద్రతా ప్రమాణాలు పాటించని వాహనాలపై చట్టపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు. విద్యార్థులు సురక్షితంగా పాఠశాలకు చేరుకోవడం, తిరిగి ఇళ్లకు చేరడం ప్రతి విద్యాసంస్థ బాధ్యత అని పేర్కొంటూ, రానున్న రోజుల్లో కూడా ఇలాంటి ప్రత్యేక తనిఖీలు కొనసాగుతాయని తెలిపారు.

# ఫ్రైడే డ్రై డే కార్యక్రమాన్ని నిర్వహించిన సర్పంచ్ శ్రీధర్



**చేగుంట జూన్ 05 మెదక్ టుడే న్యూస్** చేగుంట మండలం అనంతసాగర్ గ్రామంలో శుక్రవారం రోజున ఫ్రైడే డ్రై డే కార్యక్రమాన్ని నిర్వహించడం జరిగింది . వస్తున్నా వర్షాకాలాన్ని దృష్టిలో పెట్టుకొని ప్రతి ఇంటి పరిసర ప్రాంగణాలను పరిశీలించిన గ్రామ సర్పంచి సెక్రెటరీ వర్షాకాలంలో వానలు కురిసే గుంతల్లో నీళ్ల నిలువ ఉండడం వల్ల మరియు మురికి కాలువలు ఏర్పడడం ఇలాంటి జరగడం వల్ల మనుషులు రోగాల బారిన పడతారని ముందస్తు చర్య చేపట్టడం జరిగింది పాత కొండల్లో ప్లాస్టిక్ కవర్లలో టైర్లలో చాలా రోజులుగా అవుసులలో నీటిని నిల్వ ఉంచడం వల్ల వాటి నుండి క్రిమి కీటకాలు ఏర్పడి మనుషులకు అనేక ఇబ్బందులను కాబట్టి ఈ కార్యక్రమం ద్వారా ప్రతి ఇంటిని శుభ్రంగా ఉంచుకోవాలని ఉన్నత అధికారులు సూచించారు ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ శ్రీధర్ గ్రామ సెక్రటరీ సురేందర్ రాజ్ ఆశా వర్కర్ శ్యామల అంగన్వాడి టీచర్ చంద్రకళ వార్డు సభ్యులు గ్రామ పెద్దలు తదితరులు పాల్గొన్నారు.

# జడ్చర్ల సీఎం సభకు కేశంపేట నుంచి భారీ తరలింపు.

**- (స్పెషల్ కరస్పాండెంట్)**

**కేశంపేట,జూన్,5, మెదక్ టుడే న్యూస్:**

జడ్చర్లలో నిర్వహించిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి బహిరంగ సభకు కేశంపేట మండలం నుంచి కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, ప్రజాప్రతినిధులు భారీ సంఖ్యలో తరలివెళ్లారు. ఈ కార్యక్రమంలో మాజీ జెడ్పీటీసీ, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు తాంద్ర విశాల శ్రవణ్ రెడ్డి కీలక పాత్ర పోషించారు. సభ విజయవంతానికి ప్రత్యేక కృషి చేసిన తాంద్ర విశాల శ్రవణ్ రెడ్డి కేశంపేట మండల వ్యాప్తంగా కార్యకర్తలను సమీకరించిన కాంగ్రెస్ నాయకత్వం ప్రత్యేక బస్సుల ద్వారా వందలాది మందిని సభకు తరలింపుకేశంపేట మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు రమేష్ ఆధ్వర్యంలో, మాజీ జెడ్పీటీసీ తాంద్ర విశాల శ్రవణ్ రెడ్డి నేతృత్వంలో ప్రత్యేకంగా బస్సులు ఏర్పాటు చేసి మండలంలోని వివిధ గ్రామాల నుంచి కాంగ్రెస్ శ్రేణులను జడ్చర్ల సభకు తరలించారు. కార్యకర్తలు, యువజన నాయకులు, మహిళలు ఉత్సాహంగా సభలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా తాంద్ర విశాల శ్రవణ్ రెడ్డి మాట్లాడుతూ, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో రాష్ట్ర ప్రభుత్వం చేపడుతున్న సంక్షేమ, అభివృద్ధి



కార్యక్రమాలు ప్రజల విశ్వాసాన్ని మరింత పెంచుతున్నాయని అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీల అమలుకు కట్టుబడి పనిచేస్తోందని పేర్కొన్నారు. జడ్చర్లలో జరిగిన ముఖ్యమంత్రి సభ విజయవంతం కావడం పట్ల హర్షం వ్యక్తం చేసిన ఆయన, కాంగ్రెస్ పార్టీ మరింత బలోపేతం కావడానికి ప్రతి కార్యకర్త కృషి చేయాలని పిలుపునిచ్చారు. సభకు కాంగ్రెస్ పార్టీ నాయకులు, ప్రజాప్రతినిధులు, మహిళా నాయకులు, యువత, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో హాజరై విజయవంతం చేశారు.

# గ్రామీణ అభివృద్ధి శాఖ లక్ష్యాలను సాధించాలి

**- జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్**





**మెదక్,జూన్,5,మెదక్ టుడే న్యూస్:**

గ్రామీణ అభివృద్ధి శాఖ 2026-2027 సంవత్సరానికి శాఖ లక్ష్యాలను సాధించాలన్నారు. శనివారం కలెక్టరేట్లోని మీటింగ్ హాల్లో గ్రామీణ అభివృద్ధి శాఖ అధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్ మాట్లాడుతూ. గ్రామీణ అభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో నూతన మహిళ సంఘాల నమోదు, శ్రీనిధి లోన్స్,ధాన్యం కొనుగోళ్లు,ఇందిరా మహిళా చీరల పంపిణీ,గోదాములు, వ్యవసాయ ఉత్పత్తులు, సోలార్ పంపు సెట్లు, పెట్రోల్ బంకులు, చేయూత పింఛన్ల లో లక్ష్యాలు సాధించాలన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా గ్రామీణ అభివృద్ధి శాఖ అధికారి శ్రీనివాసరావు, అడిషనల్ గ్రామీణ అభివృద్ధి అధికారి సరస్వతి, శాఖల ఉద్యోగులు తదితరులు పాల్గొన్నారు.

# మెదక్ అర్బన్ ఫారెస్ట్ పార్కుల గొప్పతనాన్ని పర్యాటకుల కు ప్రాచుర్యం కల్పించాలి

**- ప్రపంచ పర్యావరణ దినోత్సవ శుభాకాంక్షలు కలెక్టర్**

**మెదక్,జూన్,5,(మెదక్ టుడే న్యూస్ ప్రతినిధి)**

99 రోజుల ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా శుక్రవారం మెదక్ జిల్లా రామాయంపేట మండలం అక్కన్నపేట గ్రామం వన్ యోజన అటవీ పార్కు నందు నిర్వహించిన కార్యక్రమానికి ప్రిన్సిపల్ చీఫ్ కన్జర్వేటర్ ఆఫ్ ఫారెస్ట్). హైదరాబాదు నుండి రత్నాకర్, డి ఎఫ్ ఓ జోజి, డి ఆర్ డి ఓ పి డి శ్రీనివాసరావు, ఆర్ అండ్ బి ఈ ఈ వేణు, సంబంధిత ఎఫ్ ఆర్ ఓ ,రెడ్ క్రాస్ సొసైటీ అధ్యక్షులు, యాదగిరి, శర్మ రాజశేఖర్ సర్పంచ్ యాదగిరి, ఉపసర్పంచ్ ప్రసాద్ లతో కలిసి జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్ ముఖ్య అతిథిగా పాల్గొని మొక్కలు నాటి, పర్యావరణ పరిరక్షణకు తమ వంతు బాధ్యతను చాటారు. అనంతరం అటవీ శాఖ ఏర్పాటు పర్యావరణ పరిరక్షణపై జిల్లా కలెక్టర్ ప్రతిమాసింగ్ మాట్లాడుతూ.. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు అటవీ వారోత్సవాలను ఘనంగా నిర్వహించడానికి ప్రకారం జిల్లాలో ఈ కార్యక్రమాలు విజయవంతంగా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఏక్ పెడ్ మా కే నామ్' ప్రతి భారతీయుడిని తమ తల్లి మరియు భూమాత గౌరవార్థం ఒక మొక్కను నాటమని ప్రోత్సహించే ఒక హృదయపూర్వక దేశవ్యాప్త పర్యావరణ ఉద్యమం. అన్నారు. ఇది మాతృత్వంలోని పోషణ స్ఫూర్తిని, ప్రకృతి యొక్క జీవనాధార శక్తితో అనుసంధానించి,




మరింత పచ్చని గ్రహాన్ని పెంపొం దుతుంది అన్నారు. మొక్కలు నాటుతున్నప్పుడు, మీ అమ్మ ప్రేమను, త్యాగాలను గౌరవించడానికి ఒక్క క్షణం కేటాయించా లని హితవు పలికారు. మానవాళి మనుగడకు మొక్కలే జీవనాధారాల అనే నినాదంతో ప్రతి ఒక్కరూ అమ్మ పేరు మీద ఒక మొక్క నాటినీ సంరక్షించి భవిష్యత్తులో వృక్షాలుగా ఎదిగేందుకు కృషి చేయాలన్నారు. అటవీ సంపద సంరక్షణ, జీవ వైవిధ్యం పరిరక్షణ, వన్యప్రాణుల రక్షణకు సంబంధించి అంశాలపై విద్యార్థి దశ నుండే తెలుసుకోవాలన్నారు. జిల్లాలో 24% అటవీ సంపద ఉందని ,జిల్లాలో నర్సాపూర్, వడియారం, పరికిబండ, మనోరాబాద్ అర్బన్ ఫారెస్ట్ పార్కులను హైలెట్ చేయడం జరుగుతుందన్నారు. ఈ ప్రాంతంలో ఉన్న ఫారెస్ట్ కు పిల్లలకు ప్రత్యేక టూర్ అరేంజ్ చేసి వారందరికీ జిల్లాలో అటవీ సంపద ఫారెస్ట్ పార్కులు మొక్కల వల్ల భావితరాలకు ఉపయోగం సంబంధిత విషయాలపై అవగాహన కల్పించాలన్నారు. జిల్లాలో అటవీ సంపదను పరిరక్షించడంలో అటవీశాఖ అధికారులు నిరంతరం కృషి చేస్తున్నారని ఈ సందర్భంగా వారి సేవలను కొనియాడారు. భవిష్యత్ తరాలకు ప్రశాంతమైన వాతావరణం కల్పించేలా అడవులను సం రక్షించేందుకు ఒక నిర్దిష్ట ప్రణాళిక ప్రకారం ముందుకు పోతున్నారని వివరించారు. జిల్లాస్థాయి ప్రత్యేక యాక్షన్ ప్లాన్ ద్వారా అర్బన్ ఫారెస్ట్ పార్కుల పర్యాటకులకు ప్రాచుర్యం పెంపొందించే విధంగా చర్యలు చేపడుతున్నామని వివరించారు. ఈ సందర్భంగా తెలంగాణ ప్రిన్సిపాల్ చీఫ్ కన్జర్వేటర్ ఆఫ్ ఫారెస్ట్ రత్నాక జోహారీ మాట్లాడుతూ. జిల్లాలో వరల్డ్ ఎన్రోల్మెంట్ కార్యక్రమంలో పాల్గొనడం చాలా ఆనందంగా ఉందని మానవాళి మనుగడకు చెట్లే ప్రతిరూపంగా ఉంటాయన్నారు విశాఖపట్నంలో సునామీ ఏర్పడినప్పుడు చెట్లు ఉన్న ప్రాంతాలలో దాని యొక్క తాకిడి చాలా తక్కువ మొత్తంలో ఉన్నది అంటే చెట్ల యొక్క ప్రాముఖ్యత తెలుసుకోవాలన్నారు. గ్రామీణ అభివృద్ధి శాఖ అటవీ శాఖ సమన్వయంతో ఈ కార్యక్రమాన్ని పటిష్టంగా అమలు చేయడం జరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో అటవీ శాఖ అధికారులు జిల్లా అధికారులు ,ప్రజా ప్రతినిధులు ,సిబ్బంది పాల్గొన్నారు.

# చివరి దశలో ధాన్యం కొనుగోళ్లు

- 222 ధాన్యం కొనుగోలు
- కేంద్రాలు మూసివేత
- రైతులకు 644.98 కోట్ల రూపాయలు చెల్లింపు

-జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్



మెదక్,జూన్,5,మెదక్ టుడే న్యూస్:ప్రతినిధి

ధాన్యం కొనుగోలు చివరి దశలో ఉందని జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్ అన్నారు.ఈ రోజు వరకు జిల్లా వ్యాప్తంగా 76,276 మంది రైతుల నుంచి 3,58,118,040 మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని కొనుగోలు చేసి 60,349 మంది రైతుల బ్యాంకు ఖాతాలో 644,98 కోట్ల రూపాయలు చెల్లింపులు చేసినట్లు తెలిపారు. 222 ధాన్యం కొనుగోలు కేంద్రాలు మూసివేసినట్లు తెలిపారు. రైతులు అధైర్య పడొద్దు అని ధాన్యం చివరి గింజ వరకు కొనుగోలు చేస్తామని శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు.

# జొన్నల కొనుగోళ్లు స్పీడప్ కావాలి

-అదనపు కలెక్టర్ నగేష్



మెదక్,జూన్,5,(మెదక్ టుడే న్యూస్ ప్రతినిధి)

జొన్నల కొనుగోళ్లు స్పీడప్ చేయాలని, వరి ధాన్యం అన్లోడింగ్ త్వరగా చేయాలని జిల్లా అదనపు కలెక్టర్ నగేష్ అధికారులకు సూచించారు. శుక్రవారం రామాయంపేట మండలంలోని వ్యవసాయ మార్కెట్ గోదాములు పరిశీలించారు.ఈ సందర్భంగా జిల్లా అదనపు కలెక్టర్ నగేష్ మాట్లాడుతూ.జొన్నల కొనుగోళ్లు స్పీడప్ చేయాలని జిల్లా అదనపు కలెక్టర్ నగేష్ అన్నారు. జొన్నల కొనుగోళ్లలో ప్రభుత్వ ఆదేశాలు పాటించాలని, జొన్న రైతుల అకౌంట్లో చెల్లింపులు సక్రమంగా చేయాలన్నారు. వరి ధాన్యం అన్లోడింగ్ త్వరగా జరగాలని లారీలను అందుబాటులో ఉంచుకోవాలని అధికారులను ఆదేశించారు.ఈ కార్యక్రమంలో తహసిల్దార్,అధికారులు పాల్గొన్నారు.

# బర్డ్ వాక్ కార్యక్రమం విజయవంతంచేయాలి

జిల్లా అటవీ శాఖ అధికారి జోజీ (ఐ ఎఫ్ ఎస్ )



మెదక్,జూన్,5,(మెదక్ టుడే న్యూస్ ప్రతినిధి)

ప్రకృతి పరిరక్షణ, పక్షుల సంరక్షణపై అవగాహన పెంపొందించే లక్ష్యంతో నిర్వహించబడే బర్డ్ వాక్ కార్యక్రమంను విజయ వంతం చేయాలన్నారు. జరగబోయే బర్డ్ వాక్ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్, అదనపు కలెక్టర్ నగేష్,జిల్లా అధికారులు పాల్గొననున్నారని,పోచారం ల్యాండ్‌స్కేప్ యొక్క గొప్ప పక్షి వైవిధ్యం మరియు సహజ వారసత్వం పట్ల ప్రశంసను ప్రోత్సహించడానికి, 06.06.2026 తేదీన ఉదయం 6.30 నుండి 8.00 గంటల వరకు పోచారంలోని డిబిసిలో నిర్వహించబడే బర్డ్ వాక్‌లో ప్రజలందరూ పాల్గొనాలని,పోచారం జలాశయం , అభయారణ్యం చుట్టూ ఉన్న పోచారం ప్రాంతం, వలస నీటి పక్షులు, కొంగలు, ఐబిస్‌లు, బాతులు అనేక అటవీ ప్రాంతాలతో సహా విభిన్న పక్షి జీవనానికి ప్రసిద్ధి చెందిందన్నారు. ఇది ఒక ముఖ్యమైన పక్షి వీక్షణ గమ్యస్థానంగా నిలుస్తుందనీ ప్రకృతి ప్రేమికులు, విద్యార్థులు, అధికారులు పాల్గొని వివిధ రకాల పక్షులను వీక్షించాలని , పక్షుల జీవన విధానం, వలస పక్షుల ప్రాముఖ్యత, పర్యావరణ సమతుల్యతలో వాటి పాత్ర గురించి ,పక్షుల సంరక్షణకు ప్రతి ఒక్కరూ తమ వంతు బాధ్యతగా చెట్లు నాటడం, నీటి వనరులను కాపాడడం, పర్యావరణాన్ని పరిశుభ్రంగా ఉంచడం అవసరం అన్నారు.ప్రకృతిని దగ్గరగా ఆస్వాదిస్తూ పర్యావరణ పరిరక్షణపై అవగాహన పెంపొందించుకోవడానికి బర్డ్ వాక్ వంటి కార్యక్రమాలు ఎంతో ఉపయోగపడతాయని శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు.

# అక్రమ కూల్చివేతలపై టీజేఎస్ సమర శంఖం: కమిషనర్ సస్పెన్షన్ కోసం పట్టువీడని హనుమంత్ రెడ్డి"






అమీన్‌పూర్, జూన్ 05,(మెదక్ టుడే) న్యూస్ ప్రతినిధి

సంగారెడ్డి జిల్లా పటాన్‌చెరు నియోజకవర్గం పరిధిలోని అమీన్‌పూర్ జిహెచ్ఎంసి పరిధిలోని చక్రపురి కాలనీలో ముందస్తు సమాచారం లేకుండానే హుడా లేఅవుట్ ప్లాట్లను అక్రమంగా కూల్చివేయడంపై తెలంగాణ జన సమితి తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసింది. ఈ మేరకు టీజేఎస్ పటాన్‌చెరు నియోజకవర్గ ఇంచార్జ్ వి.హనుమంత్ రెడ్డి ఆధ్వర్యంలో ఆందోళన చేపట్టారు.ఈ సందర్భంగా హనుమంత్ రెడ్డి మాట్లాడుతూ, యజమానులకు కనీస సమాచారం కూడా ఇవ్వకుండా ప్లాట్లను కూల్చివేయడం ద్వారా బాధితులకు లక్షల రూపాయల నష్టం వాటిల్లిందని ఆరోపించారు. అమీన్‌పూర్ పరిధిలో వేల సంఖ్యలో అక్రమ ప్లాట్లు, షెటర్లు ఉన్నప్పటికీ, వాటి జోలికి వెళ్లని మున్సిపల్ అధికారులు, కావాలనే టీజేఎస్‌ను టార్గెట్ చేసుకుని ఇలాంటి చర్యలకు పాల్పడుతున్నారని మండిపడ్డారు.తక్షణమే బాధ్యులైన కమిషనర్‌ను సస్పెండ్ చేయాలని, లేని పక్షంలో ప్రొఫెసర్ కోదండరాం గారి నాయకత్వంలో గ్రేటర్ హైదరాబాద్ కమిషనర్ మరియు రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గారి దృష్టికి ఈ విషయాన్ని తీసుకెళ్లి, న్యాయం జరిగే వరకు నిరంతరం పోరాటం చేస్తామని హెచ్చరించారు. ఈ ఘటనపై మున్సిపల్ అధికారులు వెంటనే వివరణ ఇవ్వాలని, నష్టపరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో న్యాయపరంగా కోర్టుకు వెళ్లేందుకు కూడా సిద్ధంగా ఉన్నామని స్పష్టం చేశారు.

# భద్రాచల వేదపండితులచే శ్రీ సీతారామ కళ్యాణం



రామచంద్రపురం, జూన్ 05,(మెదక్ టుడే) న్యూస్ ప్రతినిధి

శ్రీ సీతారామచంద్ర స్వామివారి దివ్య అనుగ్రహంతో కాకతీయ నగర్‌లోని శ్రీ సీతారామచంద్ర స్వామి దేవాలయంలో శ్రీ సీతారామ కళ్యాణ మహోత్సవం వైభవంగా నిర్వహించనున్నట్లు ఆలయ నిర్వాహకులు తెలిపారు.ఈ సందర్భంగా జూన్ 6వ తేదీ సాయంత్రం 6 గంటలకు భద్రాచలం నుండి విచ్చేసే ఉత్సవమూర్తులకు మంగళవాయిద్యాలు, హారతులు, కోలాటాలు, భజనలతో ఘన స్వాగతం పలకనున్నారు.అలాగే జూన్ 7వ తేదీ ఉదయం 10 గంటలకు భద్రాచల వేదపండితులచే శ్రీ సీతారాముల దివ్య కళ్యాణం నిర్వహించబడనుంది. అనంతరం భక్తులకు తీర్థ ప్రసాదం మరియు అన్న ప్రసాదం పంపిణీ చేయనున్నారు.ఈ పవిత్ర మహోత్సవంలో భక్తులు కుటుంబ సభ్యులు, బంధుమిత్రులతో కలిసి పెద్ద సంఖ్యలో పాల్గొని శ్రీ సీతారాముల ఆశీస్సులు పొందాలని ఆలయ కమిటీ కోరింది. వేదిక: శ్రీ సీతారామచంద్ర స్వామి దేవాలయం, కాకతీయ నగర్, రామచంద్రాపురం, బీహెచ్ఈఎల్, హైదరాబాద్

# అజాతశత్రువు ఎల్లన్న స్ఫూర్తితోనే కార్మిక సంక్షేమం

-: విగ్రహావిష్కరణలో మాజీ మంత్రి హరీష్ రావు, ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి





రామచంద్రపురం, జూన్ 05:(మెదక్ టుడే) న్యూస్ ప్రతినిది

కార్మిక హక్కుల కోసం తన చివరి శ్వాస వరకు పోరాడిన మహోన్నత వ్యక్తి, అజాతశత్రువు జి. ఎల్లయ్య అని పటాన్‌చెరు ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి కొనియాడారు. శుక్రవారం తెల్లాపూర్ పరిధిలోని జి. ఎల్లయ్య ఎన్క్లేవ్‌లో కార్మిక నాయకుడు దివంగత ఎల్లయ్య 85వ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా హాజరైన రాష్ట్ర మాజీ మంత్రి, బీఆర్ఎస్ పార్టీ డిప్యూటీ ఫ్లోర్ లీడర్ తన్నీరు హరీష్ రావు మరియు ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డిలు ఎల్లన్న విగ్రహాన్ని ఆవిష్కరించారు. అనంతరం ఆయన జీవిత చరిత్రపై రచించిన పుస్తకాన్ని ఆవిష్కరించారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే జిఎంఆర్ మాట్లాడుతూ, కార్మిక నాయకుడిగా ఉన్నప్పటి నుండి ఎల్లన్న గారితో తనకు ఆత్మీయ అనుబంధం ఉందని గుర్తు చేసుకున్నారు. పార్టీలకు అతీతంగా అందరి మన్ననలు పొందుతూ, మలిదశ తెలంగాణ ఉద్యమంలో ఎల్లన్న పోషించిన కీలక పాత్ర చరిత్రలో చిరస్థాయిగా నిలిచిపోతుందన్నారు. ఆయన జీవితం ప్రతి ఒక్కరికి స్ఫూర్తిదాయకమని పేర్కొన్నారు. మాజీ మంత్రి తన్నీరు హరీష్ రావు సూచనల మేరకు, రాబోయే ఎల్లన్న వర్ధంతి నాటికి సొంత నిధులతో 12 అడుగుల భారీ కాంస్య విగ్రహాన్ని ఏర్పాటు చేయనున్నట్లు ఎమ్మెల్యే జిఎంఆర్ ఈ వేదికగా ప్రకటించారు.ఈ కార్యక్రమంలో ఎల్లన్న గారి కుమారుడు విజయ ప్రతాప్, బీఆర్ఎస్ పార్టీ కోఆర్డినేటర్ ఆదర్శ్ రెడ్డి, సీనియర్ నాయకులు సోమిరెడ్డి, మున్సిపల్ మాజీ చైర్మన్ పాండురంగారెడ్డి, కాటా సునీత రాజేష్ గౌడ్, తుంట అంజయ్య, విజయ్ కుమార్, దాసు యాదవ్,మాజీ ప్రజాప్రతినిధులు, కార్మిక సంఘాల నాయకులు పెద్ద సంఖ్యలో ప్రజలు పాల్గొన్నారు.

# వేగంగా ధాన్యం కొనుగోలు జరగాలి

- పక్కగా జనగణన జరగాలి
- జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్



మెదక్,జూన్,5,(మెదక్ టుడే న్యూస్ ప్రతినిధి)

వేగంగా ధాన్యం కొనుగోలు చేయాలని జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్ అధికారులను ఆదేశించారు.శుక్రవారం నర్సింగ్ మండల కేంద్రంలోని ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని , జన గణనను డిఎంసిఎస్, డిఎస్ఓ, ఆర్డిఓ, తాహాసిల్దార్, జన గణన అధికారులతో కలిసి పరిశీలించారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్ మాట్లాడుతూ.. అత్యంత వేగంగా ధాన్యం కొనుగోలు జరగాలని, ధాన్యం పూర్తి అయిన కేంద్రాల్లోని సిబ్బంది, వాహనాలు , వస్తు సామాగ్రిని, హమాలిలను ధాన్యం నిలువ ఉన్న కేంద్రాల్లో పని చేయించాలన్నారు. మిల్లులో అతి త్వరగా ధాన్యం అన్లోడింగ్ జరగాలని అధికారులను ఆదేశించారు. జన గణన పక్కగా చేయాలన్నారు. జన గణన లో ప్రజల యొక్క సమాచారం పక్కగా నమోదు చేసి ఆన్లైన్ ఆప్ లో నమోదు చేయాలన్నారు.ఈ కార్యక్రమంలో అధికారులు సిబ్బంది పాల్గొన్నారు.

# వర్షాకాలం ముంచుకొస్తోంది.. జాతీయ రహదారి-65పై పకడ్బందీ భద్రతా చర్యలు చేపట్టండి: జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్





పటాన్‌చెరు, జూన్ 05:(మెదక్ టుడే) న్యూస్ ప్రతినిధి

వర్షాకాలం సమీపిస్తున్న నేపథ్యంలో జాతీయ రహదారి-65పై ప్రయాణించే వాహనదారులు, స్థానికులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా తక్షణమే ముందస్తు భద్రతా చర్యలు చేపట్టాలని జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్ అధికారులను ఆదేశించారు. సంగారెడ్డి నుండి పటాన్‌చెరు వరకు జరుగుతున్న రహదారి విస్తరణ పనుల పురోగతిని, జిల్లా ఎస్పీ పరితోష్ పంకజ్‌తో కలిసి ఆయన శుక్రవారం క్షేత్రస్థాయిలో పరిశీలించారు.

**గత సమస్యలను దృష్టిలో ఉంచుకుని..**

గత వర్షాకాలంలో ఎదురైన ఇబ్బందులను పునరావృతం కాకుండా చూడాలని కలెక్టర్ అధికారులకు సూచించారు. ముఖ్యంగా ప్రమాదాలకు ఆస్కారం ఉన్న 'బ్లాక్ స్పాట్ల' వద్ద అత్యవసర భద్రతా ఏర్పాట్లు చేయాలని, డ్రైనేజీలపై స్లాబులు వేసి ప్రమాదాలు జరగకుండా చూడాలని స్పష్టం చేశారు. నీరు నిల్వ ఉండే పాయింట్ల వద్ద వెంటనే ని పారించేందుకు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.

**అధికారులకు కలెక్టర్ దిశానిర్దేశం:**

విద్యుత్ శాఖ: రహదారి విస్తరణకు అడ్డంకిగా ఉన్న విద్యుత్ స్తంభాలను తక్షణమే తరలించాలి.రెవెన్యూ శాఖ: రోడ్డు విస్తరణకు ప్రభావితమవుతున్న భవనాల యజమానులకు పరిహారం చెల్లింపు ప్రక్రియను త్వరితగతిన పూర్తి చేయాలి. మున్సిపల్ శాఖ: రహదారికి ఇరువైపులా చెత్తాచెదారం పేరుకుపోకుండా నిరంతర పారిశుద్ధ్య పర్యవేక్షణ చేపట్టాలి. ఇరిగేషన్ శాఖ: పెద్దాపూర్ పట్నం దాబా సమీపంలోని కల్వర్టు వెంట్లను వెంటనే శుభ్రం చేసి, నీటి ప్రవాహానికి ఆటంకం లేకుండా చూడాలి.ఈ పనుల్లో జాతీయ రహదారుల సంస్థ, మున్సిపల్, విద్యుత్, రెవెన్యూ శాఖల మధ్య సమన్వయం ఉండాలని కలెక్టర్ హితవు పలికారు. ప్రజల భద్రతే ప్రాధాన్యతగా అన్ని పనులను వేగవంతం చేయాలని అధికారులను ఆదేశించారు.ఈ కార్యక్రమంలో జిల్లా ఎస్పీ పరితోష్ పంకజ్, అదనపు ఎస్పీ చైతన్య రెడ్డి, జాతీయ రహదారుల అధికారులు, వివిధ శాఖల అధికారులు, మున్సిపల్ కమిషనర్లు, ఆర్డీఓ, తహసీల్దార్లు జిహెచ్ఎంసి టౌన్ ప్లానింగ్ ఏసిపి పవన్, తదితరులు పాల్గొన్నారు.

# మహిళా, బాలల సంక్షేమానికి సమిష్టి కృషి అవసరం

- భరోసా సేవల్లో శాఖల మధ్య సమన్వయం పెంచాలి






**మెదక్,జూన్,5,(మెదక్ టుడే న్యూస్ ప్రతినిధి)**
మహిళలు, చిన్నారులపై జరిగే హింస, వేధింపుల కేసుల్లో బాధితులకు సత్వర న్యాయం అందించడంతో పాటు రక్షణ, వైద్య సహాయం, కౌన్సెలింగ్, పునరావాస సేవలు సమర్థవంతంగా అందించేందుకు సంబంధిత అన్ని శాఖల మధ్య సమన్వయం అత్యంత కీలకమని జిల్లా ఎస్పీ డి.వి. శ్రీనివాసరావు పేర్కొన్నారు. జిల్లా పోలీస్ కార్యాలయంలో శుక్రవారం భరోసా కార్యక్రమానికి సంబంధించిన కన్వర్జెన్స్ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో మహిళలు, చిన్నారుల సంక్షేమానికి సంబంధించిన వివిధ శాఖల అధికారులు, ప్రతినిధులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ మహిళలు, చిన్నారులపై నమోదవుతున్న కేసుల్లో వేగవంతమైన దర్యాప్తు జరగడంతో పాటు బాధితులకు అవసరమైన అన్ని సేవలు సకాలంలో అందేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. వైద్య, న్యాయ, కౌన్సెలింగ్, పునరావాస సేవల కల్పనలో పోలీసు శాఖతో పాటు ఇతర శాఖలు సమన్వయంతో పనిచేయాల్సిన అవసరం ఉందన్నారు. బాధితులకు సేవలు అందించే ప్రక్రియలో ఎలాంటి జాప్యం లేకుండా చూడాలని అధికారులకు సూచించారు. భరోసా కేంద్రాల ద్వారా బాధితులకు ఒకే వేదికపై అన్ని రకాల సహాయ సేవలు అందుబాటులోకి తీసుకురావడం ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని తెలిపారు. ఈ కేంద్రాల పనితీరును మరింత సమర్థవంతంగా తీర్చిదిద్దేందుకు అన్ని శాఖలు సహకరించాలని కోరారు. కేసుల పరిష్కారంలో ప్రతి శాఖ తన బాధ్యతలను సమయానుకూలంగా నిర్వర్తించడంతో పాటు రిఫరల్ వ్యవస్థను మరింత బలోపేతం చేయాలని సూచించారు. బాధితులు అవసరమైన సేవల కోసం వివిధ కార్యాలయాల చుట్టూ తిరగకుండా ఒకే చోట అన్ని సౌకర్యాలు పొందేలా చర్యలు తీసుకోవాలన్నారు. సమావేశంలో అడిషనల్ ఎస్పీ విక్రాంత్ కుమార్ సింగ్ ఐపీఎస్, డియస్పి ప్రసన్న కుమార్, భరోసా కోఆర్డినేటర్ సౌమ్య, చైల్డ్‌లైన్ ప్రతినిధులు, సీడబ్ల్యూసీ, జేజేబీ సభ్యులు, డీఎల్ఎస్ఏ ప్రతినిధులు, పబ్లిక్ ప్రాసిక్యూటర్లు, వైద్య ఆరోగ్య శాఖ అధికారులు, మహిళా--శిశు సంక్షేమ శాఖ అధికారులు, ఎస్ఈఆర్పీ ప్రతినిధులు, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు, దర్యాప్తు అధికారులు, షీటీం సిబ్బంది పాల్గొన్నారు.

# రైతుల సమస్యలపై స్పందించిన ఎస్పీ

- ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని సందర్శించి సమస్యలపై ఆరా
- లారీలు, టార్పాలిన్ల ఏర్పాటుకు అధికారులకు ఆదేశాలు



**మెదక్,జూన్,5,(మెదక్ టుడే న్యూస్ ప్రతినిధి)**
రైతులు ఎదుర్కొంటున్న సమస్యలను క్షేత్రస్థాయిలో తెలుసుకుని పరిష్కరించేందుకు మెదక్ జిల్లా ఎస్పీ డి.వి. శ్రీనివాసరావు ఐపీఎస్ శుక్రవారం మెదక్ లోని దయరా పరిధిలోని ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా డీఎస్పీ ప్రసన్నకుమార్, ఎస్బీ ఇన్‌స్పెక్టర్ సందీప్‌రెడ్డి, ఎస్ఐ నారాయణతో కలిసి కేంద్రంలోని పరిస్థితులను పరిశీలించి రైతులతో మాట్లాడారు. ధాన్యాన్ని రైస్‌మిల్లులకు తరలించేందుకు సరిపడా లారీలు అందుబాటులో లేక కొనుగోలు ప్రక్రియ ఆలస్యమవుతోందని రైతులు ఎస్పీ దృష్టికి తీసుకువచ్చారు. అలాగే వర్షాల కారణంగా ధాన్యం తడిసిపోకుండా ఉండేందుకు బ్లాక్ టార్పాలిన్లు అవసరమని కోరారు. దీనిపై వెంటనే స్పందించిన ఎస్పీ, జిల్లా అదనపు కలెక్టర్ నగేష్‌తో ఫోన్‌లో మాట్లాడి రైతులకు అవసరమైన టార్పాలిన్లు, ఇతర సౌకర్యాలు కల్పించేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. దీనికి స్పందించిన అదనపు కలెక్టర్ తక్షణమే అవసరమైన ఏర్పాట్లు చేస్తామని హామీ ఇచ్చారు. ధాన్యం రవాణాకు అవసరమైన లారీల కొరతపై కూడా ఎస్పీ స్పందించి సంబంధిత శాఖలతో సమన్వయం చేసుకుని రైతులకు లారీలు అందుబాటులో ఉండేలా చర్యలు చేపట్టాలని డీఎస్పీ ప్రసన్నకుమార్‌ను ఆదేశించారు. రైతులకు ఎలాంటి అన్యాయం జరగకుండా అధికారులు అప్రమత్తంగా వ్యవహరించాలని, సమస్యల పరిష్కారానికి సమన్వయంతో పనిచేయాలని సూచించారు. రైతుల సంక్షేమానికి జిల్లా పోలీసులు ఎల్లప్పుడూ సహకారం అందిస్తారని, రైతుల సమస్యల పరిష్కారానికి జిల్లా యంత్రాంగంతో కలిసి అవసరమైన చర్యలు తీసుకుంటామని ఎస్పీ డి.వి. శ్రీనివాసరావు తెలిపారు.

# జడ్చర్ల సభలో షాద్‌నగర్ కాంగ్రెస్ శ్రేణుల సత్తా చాటింపు

- సీఎం రేవంత్ రెడ్డి సభలో ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ ప్రత్యేక ఆకర్షణ
- వేలాదిగా తరలివచ్చిన మహిళలు, యువత, కార్యకర్తలు
- కాంగ్రెస్ జెండాలు, నినాదాలతో కళకళలాడిన జడ్చర్ల మార్గాలు
- వీర్లపల్లి శంకర్ పిలుపుకు విశేష స్పందన
- (స్పెషల్ కరస్పాండెంట్)





**జడ్చర్ల,జూన్,5, మెదక్ టుడే న్యూస్:**
జడ్చర్లలో ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి నిర్వహించిన భారీ బహిరంగ సభకు షాద్‌నగర్ నియోజకవర్గం నుంచి కాంగ్రెస్ పార్టీ శ్రేణులు పెద్ద ఎత్తున హాజరై తమ ఉత్సాహాన్ని చాటుకున్నాయి. షాద్‌నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ ఆధ్వర్యంలో ఫరూక్‌నగర్, కొత్తూరు, నందిగామ, కేశంపేట, చౌదరిగూడ, కొందుర్గు మండలాలతో పాటు షాద్‌నగర్, కొత్తూరు మున్సిపాలిటీల పరిధిలోని గ్రామాల నుంచి వేలాదిమంది కార్యకర్తలు సభకు తరలివచ్చారు. ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ ఇచ్చిన పిలుపుకు అనూహ్య స్పందన లభించడంతో జడ్చర్లకు వెళ్లే ప్రధాన రహదారులు కాంగ్రెస్ జెండాలు, బ్యానర్లు, పార్టీ నినాదాలతో సందడిగా మారాయి. మహిళలు, యువత, అభిమానులు, కార్యకర్తలు భారీ సంఖ్యలో హాజరుకావడంతో సభా ప్రాంగణం జనసంద్రాన్ని తలపించింది. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సభా కార్యక్రమంలో ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ ఆయన వెంట పాల్గొ నగా, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున నినాదాలు చేస్తూ ఉత్సాహాన్ని ప్రదర్శించారు. సభా వేదిక వద్ద కూడా వీర్లపల్లి శంకర్‌కు కార్యకర్తల నుంచి విశేష ఆదరణ లభించింది. సీఎం పర్యటన సందర్భంగా ఆయన ప్రత్యేక ఆకర్షణగా నిలి చారని పార్టీ శ్రేణులు పేర్కొన్నాయి. ఈ కార్యక్రమంలో గిరిజన ఆదివాసీ రాష్ట్ర కోఆర్డినేటర్ అగ్గనూర్ విశ్వం, సీనియర్ నాయ కుడు చెంది తిరుపతి రెడ్డి, వివిధ మండలాల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు, ప్రజా ప్రతినిధులు,నాయకులు,కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# హైదరాబాద్ జనాభా కోటిన్నర! - ఇప్పటివరకు లెక్క



**హైదరాబాద్ :** తెలంగాణ ప్రభుత్వం 2010 నాటి జనాభా లెక్కలు, ఓటర్ల సంఖ్యను ఆధారంగా చేసుకుని ఓఆర్ఆర్ పరిధిలో 1.34 కోట్ల మంది ఉంటారని అంచనా వేసింది. కానీ ఇపుడు ఆ అంచనాలు దాటిపోయి గణాంకాలు నమోదవుతున్నాయి. 90 శాతం ఇళ్లలోనే 1.3 కోట్ల మంది ప్రజలు నివసిస్తున్నట్లు ప్రాథమికంగా తెలుస్తోంది. ఆ లెక్క ఆధారంగా వంద శాతం సర్వే పూర్తయితే జనాభా కోటిన్నర వరకు ఉండే అవకాశం ఉంది. 90 శాతం ఇళ్లలో 5 శాతం వరకు తాళం వేసినవి ఉన్నాయి. జూన్ 9న సర్వే గడువు పూర్తవుతుంది. ఈ సమయంలో తాళం వేసి ఉన్న ఇళ్లను మరోసారి సర్వే చేయాలని ప్రధాన జనగణన అధికారి ఆర్వీ కర్ణన్? తెలిపారు.

**కోటిన్నర జనాభా ఉండవచ్చని అంచనా :** మొదటిదశ జనగణన మే 11న మొదలైంది. అప్పటి నుంచి ఇప్పటి వరకు 45 లక్షల ఇళ్ల వరకు జనగణన నమోదు చేశారు. ఔటర్ రింగ్? రోడ్డు వరకు ఉన్న 300 డివిజన్లను యూనిట్‌గా తీసుకుని హైదరాబాద్ నగరంలో జనాభాను లెక్కిస్తున్నారు. మొత్తం 20 వేల హౌస్ లిస్టింగ్ బ్లాక్‌లుగా విభజించి ఇంటింటికి సర్వే చేస్తున్నారు. ఎన్యుమరేటర్స్ ఇప్పటివరకు 41 లక్షల ఇళ్లను సందర్శించారు. అయితే ఆయా హౌస్ లిస్టింగ్? బ్లాక్?లో మరో 10 శాతం ఇళ్లను సర్వే చేయాల్సి ఉంది. ఒక అంచనాగా 45 లక్షల ఇళ్లు ఉండవచ్చని, వాటిలో కోటిన్నర జనాభా ఉండవచ్చని అధికారులు భావిస్తున్నారు. ఒక కుటుంబం వివరాలను రెండుసార్లు నమోదు చేయడం, సంబంధించిన విషయాలను తప్పులుగా రాయడం వంటివి సరిచేస్తే జనాభా సంఖ్య మారుతుంది. ఫిబ్రవరి 2027లో జరగబోయే రెండోదశ జనగణనలో పూర్తి జనాభా లెక్క తెలుస్తుందని అధికారులు చెబుతున్నారు.

**ప్రతి కుటుంబ వివరాలు నమోదు చేయాల్సిందే :** ఐదు శాతానికి పైగా జనాభా ఉదయాన్నే ఉద్యోగాలకు వెళ్లి, రాత్రికి ఇంటికి చేరుకుంటారు. మూతపడ్డ ఇళ్లు జూన్? 3వ వరకు 5.42 శాతం ఉన్నట్లు గణాంకాలు చెబుతున్నాయి. దీనికోసం బ్లాకుల వారీగా వారి ఇళ్లను ఉదయాన్నే సందర్శించాలి. అవసరమైతే సాయంత్రం వరకు కూడా సర్వే చేయాలి. ప్రతి కుటుంబం వివరాలు నమోదు కావాల్సిందేనని ఉన్నతాధికారులు ఎన్యుమరేటర్స్?కు చెప్పారు. జనాభాలో గ్రేటర్ నగరంలో 3 కార్పొరేషన్ల జనాభాలో జీహెచ్?ఎంసీ ముందు వరుసలో ఉంది. ఇప్పటికే ఇక్కడ 55 లక్షల జనాభాని లెక్క తెలిసింది. ఆ తర్వాత స్థానంలో సైబరాబాద్, మల్కాజ్‌గిరి కార్పొరేషన్లు ఉన్నాయి. కానీ కంటోన్మెంట్‌లో మాత్రం జనగణన నత్తనడకన సాగుతోంది.

**సహకరించని ఇంటి యజమానులు :** కొందరు ఇంటి యజమానులు ఎన్యుమరేటర్స్?కు సహకరించడం లేదు. వారు అడిగే అన్ని ప్రశ్నలకు సమాధానాలు ఇవ్వకపోగా, ఎందుకంటూ వారినే ప్రశ్నిస్తున్నారు. దీంతో వివరాలు నమోదు చేసుకునే క్రమంలో ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తుంది. సెల్ఫ్ ఎన్యుమరేట్ చేసుకున్న వారు ఐడీ నంబర్ చెప్పేసరికి నిమిషాల వ్యవధిలోనే ప్రక్రియ పూర్తవుతోంది. ఇంటింటా తిరిగే ఎన్యుమరేషన్? సిబ్బందికి సహకరించాలని సెన్సెస్ ఉన్నతాధికారులు కోరుతున్నారు.

**ఎన్యూమరేటర్లకు విచిత్ర అనుభవాలు :** రాష్ట్రంలో మిగతా చోట్ల కూడా జనగణన జరుగుతోంది. అయితే పలుచోట్ల సిబ్బందికి విచిత్ర పరిస్థితులు ఎదురవుతున్నాయి. నల్గొండ జిల్లా మేళ్లచెరువు మండలంలోని ఓ గ్రామంలో బైకు, కారు ఇంటి ముందే ఉన్న తమవి కాదని చెప్పారు. ఇంటి గురించి అడగ్గా 8 గదులున్నా మూడో, నాలుగో రాసుకోండని చెప్పారు. మరో ఇంటి వారైతే ల్యాప్?టాప్? ఉన్న, కంపెనీదని చెప్పారు. టీవీ ఉన్న అది పనిచేయట్లేదన్నారు. గ్యాస్?పొయ్యి ఉన్నా కట్టెల పొయ్యి అని రాయాలని కోరారు.

# తెల్లాపూర్ నగరాన్ని ప్లాస్టిక్ రహితంగా మారుస్తాం: ఎంపీ రఘునందన్ రావు







**రామచంద్రపురం , జూన్ 05:(మెదక్ టుడే) న్యూస్ ప్రతినిధి**
ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా పటాన్చెరు నియోజకవర్గం, తెల్లాపూర్ డివిజన్‌లో మెదక్ పార్లమెంట్ సభ్యులు మాధవనేని రఘునందన్ రావు పర్యటించారు. ఈ సందర్భంగా పర్యావరణ హిత కార్యక్రమాల్లో పాల్గొన్న ఆయన, తెల్లాపూర్ ప్రాంతాన్ని 'ప్లాస్టిక్ రహిత తెల్లాపూర్'గా మార్చడమే తమ లక్ష్యమని ప్రకటించారు. ఈ సందర్భంగా ఎంపీ మాట్లాడుతూ, వేగంగా అభివృద్ధి చెందుతున్న తెల్లాపూర్ వంటి ప్రాంతాలలో పర్యావరణ పరిరక్షణ అత్యంత కీలకమని తెలిపారు. పట్టణీకరణ వల్ల పెరుగుతున్న ప్లాస్టిక్ వ్యర్థాలు, నిర్మాణ వ్యర్థాల వల్ల పర్యావరణ సమతుల్యత దెబ్బతింటోందని ఆందోళన వ్యక్తం చేశారు. స్థానిక సాఫ్ట్‌వేర్ ఉద్యోగులు, నివాసితులు అందరూ కలిసి ఈ సమస్యను పరిష్కరించాలని కోరారు. ప్రధాని మోదీ పిలుపు మేరకు మొక్కలు:ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ప్రారంభించిన 'మా కి నామ్ పే ఏక్ పేడ్' (తల్లి పేరుతో ఒక మొక్క) నినాదానికి అనుగుణంగా, ప్రతి ఒక్కరూ మొక్కలు నాటాలని ఎంపీ రఘునందన్ రావు పిలుపునిచ్చారు. ప్లాస్టిక్ నియంత్రణ: స్థానిక వ్యాపారులు, షాపుల యజమానులు ప్లాస్టిక్ వాడకాన్ని తగ్గించాలని కోరుతూ, వ్యాపార సంస్థల వద్ద అవగాహన పోస్టర్లను అంటించారు. కలిసి పనిచేయాలి: కేవలం ప్రభుత్వాలపై ఆధారపడకుండా, పర్యావరణాన్ని కాపాడుకోవడం ప్రతి పౌరుడి సామాజిక బాధ్యత అని ఎంపీ గుర్తు చేశారు. టేనా మిత్రుల అభినందన: పర్యావరణ పరిరక్షణ కోసం కృషి చేస్తున్న 'టేనా' సంస్థ సభ్యులను ఈ సందర్భంగా ఆయన ప్రత్యేకంగా అభినందించారు. ఈ కార్యక్రమంలో స్థానిక సాఫ్ట్‌వేర్ ఉద్యోగులు, కాలనీ వాసులు, పార్టీ నాయకులు మరియు పర్యావరణ ప్రేమికులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

printed published and owned by CHILVERA SHIVAKUMAR and printed JWAALA PRINTERS H.NO.- 10-15/1/A, KUMMARI GAINI,MANDAL PAPANNAPETA, DISTRICT, MEDAK, TELANGANA- 502303- Gmail.medaktoday94@gmail.com,Editor: CHILVERA SHIVAKUMAR. RNI NO.TELTEL. 2023 ,88524, 9948265095.9494117870..